# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/






## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ

- తిరుమలలో బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లు...
- శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 30 గంటల సమయం
- బాట గంగమ్మ ఆలయం వరకు చేరిన క్యూలైన్లు
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు
- నిన్న శనివారం 97 వేల మందికి పైగా స్వామివారి దర్శనం

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

### ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి

జగన్‌తో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పారన్న ప్రొఫెసర్ నాగేశ్వర్



ఈ విషయాన్ని పవన్ జనసేన నేతలతో చెప్పారని వెల్లడి

ప్రొఫెసర్ నాగేశ్వర్ వైసీపీ తొత్తు అంటూ జనసైనికుల మండిపాటు

పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.. కేసులు నమోదు

## జొన్న, మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు నిధులు కేటాయించిన రేవంత్ ప్రభుత్వం

రైతులను కాపాడాలని సీఎం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారన్న తుమ్మల

పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



తెలంగాణలోని అన్నదాతలకు రేవంత్‌రెడ్డి సర్కార్ తీపి కబురు అందించింది. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న పంటల కొనుగోళ్లకు భారీగా నిధులను కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

## జగన్ మళ్లీ సీఎం అవుతారని చంద్రబాబుకు భయం పట్టుకుంది: అంబటి రాంబాబు



కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్న అంబటి

అందుకే చంద్రబాబు వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శ

చంద్రబాబు, లోకేశ్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ

# రాష్ట్రంలో ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు..

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేరేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం

వ్యవసాయ కనెక్షన్లు మినహా అందరికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిర్ణయం

మీటర్ల ఖర్చును 60:40 నిష్పత్తిలో భరించనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదన్న ప్రభుత్వం

గత ప్రభుత్వ ఒప్పందాన్నే తాము ముందుకు తీసుకెళ్తున్నామన్న మంత్రి పొంగులేటి

రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లు మినహా అన్ని విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్‌ఎస్)లో చేరాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం సమావేశమైన కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ





## ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనం: నారా లోకేష్

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ రద్దు కాలేదని ప్రభుత్వం స్పష్టీకరణ

పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలరోజులు ఆలస్యం

పాఠశాలలు తెరిచేనాటికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ

యూనిఫాం, బూట్లు, బ్యాగ్‌ల సరఫరాకు కొంత సమయం

వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్న మంత్రి నారా లోకేష్

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిగా నిలిపివేసిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారం వందశాతం అవాస్తవమని, కిట్ల పంపిణీని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు.

## ప్రస్తుతానికి ఇబ్బందులు తప్పవు

వలసల విధానాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాం

వీసాల జారీలో మెరుగైన వ్యవస్థ తీసుకొస్తున్నాం

వలసలను స్వాగతించే అతిపెద్ద దేశం అమెరికా

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టీకరణ

విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ

మార్పుల వల్ల చట్టబద్ధమైన వలసలు ప్రభావితం కాకూడదన్న జైశంకర్

న్యూఢిల్లీ: వీసాల జారీ విషయంలో మరింత మెరుగైన వ్యవస్థను తీసుకురావాలన్నదే తమ ఉద్దేశమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెప్పారు. వలసల విధానాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టామని, ఈ మార్పు సమయంలో కొన్ని ఆటంకాలు, ఇబ్బందులు ఉండొచ్చని అన్నారు. చట్టబద్ధమైన వలసదారులకు ప్రయోజనం చేకూర్చేలా అంతిమంగా ఒక సమర్థవంతమైన వ్యవస్థను తీసుకురావాలన్నదే తమ ఉద్దేశమని తేల్చిచెప్పారు.



## ఒప్పందానికి చేరువలో..

అమెరికా-- ఇరాన్ ఒప్పందం ఖరారు!

అమెరికా షరతులకు ఇరాన్ అంగీకారం


యురేనియం వదిలించుకోవడానికి సిద్ధం

హోర్ముజ్ తెరవడానికి గ్రీన్‌సిగ్నల్

సమయం అనుకూలంగా ఉంది

ఒప్పందానికి తొందరొద్దని చెప్పా

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్ : పశ్చిమాసియాలో కల్లోలానికి తెరదించి.. శాంతి, స్థిరత్వం నెలకొల్పడానికి అడుగులు ముందుకు పడుతున్నాయి. యుద్ధాన్ని ముగించి, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచి, శుద్ధిచేసిన యురేనియం నిల్వలను ఇరాన్ వదులుకునేలా చేసే ఒప్పందానికి అమెరికా చాలా చేరువలోకి వచ్చేసిందని అధికార వర్గాలు స్పష్టంచేశాయి.



## ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

ముత్యంరెడ్డి, కల్పన, పండరి

ఆపై జేసీబీతో గొయ్యితీసి శవం పూడ్చివేత

నారాయణఖేడ్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా మనూరు మండలం ఎల్గోయి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ హత్య ఉదంతం తొమ్మిది రోజుల అనంతరం ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం..

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# ఒప్పందానికి చేరువలో..

అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం దాదాపు ఖరారైనట్లేనని పేర్కొన్నాయి. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని వెల్లడించాయి. అణ్వాయుధ పరీక్షలకు దూరంగా ఉండాలని, శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. అయితే, దీనికి ఇరాన్ ఇప్పటిదాకా బహిరంగంగా అంగీకరించలేదు.

**ఆ నిజాన్ని ఇరాన్ అర్థం చేసుకోవాలి**

ఇరాన్‌తో ఇప్పందం చాలావరకు కుదిరిందని ట్రంప్ శనివారం ప్రకటించారు. ఈ విషయంలో భాగస్వా మిగా ఉన్న మిత్రదేశాలతో మాట్లాడానని చెప్పారు. "ఇరాన్‌తో చర్చలు క్రమబద్ధంగా, నిర్మాణాత్మకంగా సాగుతున్నాయి. సమయం మనకు అనుకూలంగా ఉన్నందున, ఒప్పందానికి తొందరపడవద్దని నా ప్రతినిధులకు తెలియజేశా. ఇరు పక్షాలు కొంత సమయం తీసుకుని సరైన నిర్ణయానికి రావాలి. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలి"అంటూ ఆదివారం సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ఇరాన్‌తో అమెరికా సంబంధాలు మరింత ఫలవంతంగా మారుతున్నాయని ఉద్ఘాటించారు. ఒప్పందం కుదిరి, ధ్రువీకరించబడి, సంతకం చేసే వరకూ ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం పూర్తి స్థాయిలో కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, భద్రతా సంబంధాలను నెలకొల్పే అబ్రహం ఒప్పందంలో చేరాలని ఇరాన్‌ను ట్రంప్ ఆహ్వానించారు. అయితే, అణ్వాయుధాన్ని లేదా బాంబును అభివృద్ధి చేయలేమని లేదా సమకూర్చుకోలేమన్న నిజాన్ని ఇరాన్ అర్థం చేసుకోవాలన్నారు.

**మరికొన్నిగంటల్లో శుభవార్త: రూబియో**

ఇరాన్‌తో చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలియజేశారు. రాబోయే కొన్ని గంటల్లోనే శుభవార్త వినే అవకాశం ఉందని చెప్పారు. ఇరాన్‌తో ఒప్పందంపై అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ప్రకటన చేస్తారని సంకేతాలిచ్చారు. రూబియో ఆదివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. వివాదాన్ని పరిష్కరించేందుకు సంబంధిత ముసాయిదాపై గత 48 గంటల్లో జరిగిన చర్చల్లో పురోగతి సాధించామని పేర్కొన్నారు. కానీ, ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వివరించారు. ఇరాన్ వద్ద ఎప్పటికీ అణ్వాయుధాలు ఉండకూడదనేదే అంతిమ లక్ష్యమని స్పష్టంచేశారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండడానికి వీల్లేదన్నారు.

# ప్రస్తుతానికి ఇబ్బందులు తప్పవు



'ప్రపంచంలో వలసలను స్వాగతించే అతిపెద్ద దేశం అమెరికా'అని ఉద్ఘాటించారు. అక్రమ వలసదార్ల సవాలును పరిష్కరించడానికి వీసాల జారీలో సంస్కరణలు ప్రారంభించామని, ఇందులో భారత్‌ను ఎంతమాత్రం టార్గెట్ చేయడం లేదని వివరణ ఇచ్చారు. ఇటీవలి కాలంలో వీసా, వలస విధానాల్లో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేసిన మార్పుల పట్ల భారత్ ఆందోళనను విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్.. మార్కో రూబియో దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ విధానపరమైన మార్పుల వల్ల చట్టబద్ధమైన వలసలు ప్రతికూలంగా ప్రభావితం కాకూడదని అన్నారు. ఎస్.జైశంకర్, రూబియో ఆదివారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ప్రధానంగా భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. కీలక రంగాల్లో ఇరుదేశాలు పరస్పరం సహకరించుకోవాలని, కలిసికట్టుగా ముందుకెళ్లాలన్న అభిప్రాయానికి వచ్చారు. అనంతరం ఇరువురు నేతలు ఉమ్మడిగా మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల మధ్య సంబంధాలే భారత్--అమెరికా సంబంధాలకు కీలకమని జైశంకర్ అన్నారు. అమెరికాల వీసాల జారీ విషయంలో భారతీయులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి రూబియోకు తెలియజేశానని వెల్లడించారు. చట్టబద్ధంగా వెళ్లేవారిని ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని కోరానని పేర్కొన్నారు. అక్రమ వలసలను అరికట్టే విషయంలో అమెరికాకు సహకరిస్తున్నామని గుర్తుచేశారు. చట్టబద్ధమైన వలసలకు అడ్డంకులు సృష్టించవద్దని అమెరికాకు సూచించారు. అన్నింటికంటే ముఖ్యంగా రెండు దేశాల వ్యాపార, సాంకేతిక, పరిశోధన సహకారానికి వలసలు కీలకమని ఉద్ఘాటించారు. హెచ్--1బీ వీసా నిబంధనలను ట్రంప్ ప్రభుత్వం కఠినతరం చేయడం భారతీయులకు శరాఘాతంగా మారింది. గ్రీన్ కార్డు విషయంలోనూ వారు ఆందోళనకు గురవుతున్నారు. గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే స్వదేశానికి వెళ్లేలా నిబంధన తీసుకొచ్చారు. అమెరికా తన విదేశాంగ విధానాన్ని 'అమెరికా ఫస్ట్'గా నిర్దేశించుకుందని, భారతదేశానికి 'ఇండియా ఫస్ట్'విధానం ఉందని జైశంకర్ అన్నారు. స్వదేశీ జాతీయ ప్రయోజనాకు ఇరుదేశాలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని వివరించారు.

**భారత్ మా లక్ష్యం కాదు**

గ్రీన్ కార్డ్ నిబంధనల్లో మార్పులపై ప్రశ్నకు రూబియో సమాధానమిస్తూ.. ప్రస్తుత వ్యవస్థను సంస్కరించే సమగ్ర విధానంలో ఇది ఒక భాగమని వెల్లడించారు. అమెరికాలో వలస సంక్షోభం నెలకొందని అంగీకరించారు. ఇది భారతదేశం వల్ల జరిగిందని తాను చెప్పడం లేదన్నారు. గత కొన్నేళ్లుగా 2 కోట్ల మందికి పైగా ప్రజలు చట్టవిరుద్ధంగా అమెరికాలోకి ప్రవేశించారని, ఆ సవాలును పరిష్కరించాల్సి ఉందని వివరించారు. ప్రస్తుత వ్యవస్థను సంస్కరించే ప్రక్రియలో భారత్ తమ లక్ష్యం కాదని బదులిచ్చారు. ఎప్పుడైనా ఒక సంస్కరణను చేపట్టినప్పుడు, ప్రజలు భాగస్వాములయ్యే వ్యవస్థలో మార్పు చేసినప్పుడు.. కొన్ని ఇబ్బందులను, అవరోధాలను సృష్టించే ఒక పరివర్తన కాలం ఉంటుందని వ్యాఖ్యానించారు. మన గమ్యం ఒక మెరుగైన వ్యవస్థగా, మరింత సమర్థవంతమైన వ్యవస్థగా ఉంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడున్న దానికంటే మెరుగైన, సుస్థిరమైన వీసా విధానాన్ని తీసుకురాబోతున్నామని వెల్లడించారు.

**మూర్ఖులు ఎక్కడైనా ఉంటారు**

అమెరికాలో భారతీయులు జాత్యహంకారాన్ని ఎదుర్కొంటున్నారనే ఆరోపణల్లో నిజం లేదని మార్కో రూబియో తెలిపారు. నిజంగా భారతీయులపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని అన్నారు. ఆన్‌లైన్‌లో, బయట కూడా వ్యాఖ్యలు చేసిన వారు కచ్చితంగా ఉంటారని నేను భావిస్తున్నానని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి దేశంలోనూ తెలివితక్కువ ప్రజలు, మూర్ఖులు ఉంటారని వ్యాఖ్యానించారు.

## తెలుగు రాష్ట్రాల్లో గాలివాన బీభత్సం... ముగ్గురి మృతి

**ఉక్కపోతతో ఇబ్బందిపడుతున్న పలు జిల్లాల్లో గాలి వాన బీభత్సం**

**ఏపీలోని అనకాపల్లి, కాకినాడ, తెలంగాణలోని నాగర్ కర్నూలు జిల్లాల్లో గాలితో కూడిన వర్షం**

**సత్యవరంలో కొబ్బరిచెట్లు నేలకూలి ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు కూలీలు**

గత కొన్నిరోజులుగా తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే శనివారం తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ గాలివాన బీభత్సం సృష్టించింది. ఏపీలోని అనకాపల్లి, కాకినాడ, తెలంగాణలోని నాగర్ కర్నూలు జిల్లాల్లో గాలితో కూడిన వర్షం అల్లకల్లోలం సృష్టించింది. గాలివాన బీభత్సం కారణంగా ఏపీలో ఇద్దరు, తెలంగాణలో ఒకరు మృత్యువాత పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో దాదాపు అరగంట పాటు గాలి, వాన రావడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రమణయ్యపేట, ముకుందరాజుపేట, దోసలపాడు, చీడిక, జి.జగన్నాథపురం, గొడిచర్ల, డొంకాడ, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ. రహదారి వంటి గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి.సత్యవరం గ్రామంలో కొబ్బరిచెట్లు నేలకూలి తమలపాకులు సేకరించే ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. ముకుందరాజుపేటలో ఇంటి రేకులు పడి ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. గాలుల ప్రభావంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. మామిడి, అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

## రేపటి నుంచి 'రైతు గోస - బీజేపీ భరోసా' యాత్ర: రఘునందన్ రావు

**రైతులతో రాజకీయాలు చేయడం రేవంత్ కు అలవాటుగా మారిందన్న రఘునందన్ రావు**



అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి ప్రజలకు సీఎం తప్పుడు సమాచారం ఇస్తున్నారని విమర్శ ప్రభుత్వ వైఫల్యాలపై నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామన్న బీజేపీ ఎంపీ రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రేపటి నుంచి 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరిట ప్రత్యేక యాత్రను చేపట్టబోతున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు. ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులతో రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు ఎక్కడ జరిగిందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన తప్పుడు నివేదికలను చూసి సీఎం ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఆయనకు నచ్చిన జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో నేరుగా రైతులతో మాట్లాడితే, కొనుగోళ్లు ఎంతవరకు జరిగాయో అసలు నిజాలు తెలుస్తాయని హితవు పలికారు.ఈ రెండు రోజుల యాత్రలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల మీద తాము నేరుగా రైతులతోనే మాట్లాడిస్తామని రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము రాజకీయాలు చేయాలనుకుంటే వేరేలా చేస్తామని, కానీ తమకు కావాల్సింది కేవలం అన్నదాతల సంక్షేమమేనని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు..

(మొదటి పేజీ తరువాయి)

కనెక్షన్లు మినహా మిగిలిన అన్ని గృహ, వాణిజ్య కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.గత ప్రభుత్వ ఒప్పందాన్నే అమలు చేస్తున్నాం: మంత్రి పొంగులేటి కేబినెట్ సమావేశం అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యుత్ నష్టాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అయితే, ఈ ఆర్డీఎస్ఎస్ పథకంలో చేరాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర విద్యుత్ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. కానీ, నాటి ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లలేదని, అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వాలే భరిస్తాయని, వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తం వ్యయంలో 60% కేంద్ర ప్రభుత్వం, 40% రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని అధికారులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి మరోసారి తేల్చిచెప్పారు. డిస్కంల ఆదాయ, వ్యయాల మధ్య అంతరాన్ని తగ్గించి, వాటిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కాగా, విద్యుత్ ఛార్జీల పెంపు అంశం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) పరిధిలోనే ఉంటుందని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు, ఛార్జీల పెంపునకు ప్రత్యక్ష సంబంధం లేదని అధికారులు స్పష్టం చేశారు.

## ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనం: నారా లోకేష్

(మొదటి పేజీ తరువాయి)

కేవలం కొన్ని అంతర్జాతీయ కారణాల వల్ల కిట్ల సరఫరాలో సుమారు నెల రోజుల జాప్యం జరుగుతోందని తెలిపారు.ప్రభుత్వం నిజాయతీగా జాప్యం గురించి వెల్లడిస్తే, దానిని వక్రీకరించి అసలు కిట్లే ఇవ్వరంటూ వైసీపీ పార్టీ విష ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనమని విమర్శించారు.పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ముడిసరుకుల ధరలు పెరగడం, రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో యూనిఫాం క్లాత్, బూట్లు, బ్యాగుల సరఫరా ఆలస్యమవుతోందని విద్యాశాఖ అధికారులు తెలిపినట్లు లోకేష్ వివరించారు. అయితే, జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు.మిగిలిన వస్తువులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని లోకేష్ పేర్కొన్నారు.

## జగన్ మళ్లీ సీఎం అవుతారని చంద్రబాబుకు భయం పట్టుకుంది: అంబటి రాంబాబు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరిగిందని, దాని నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే భయం చంద్రబాబుకు పట్టుకుందని, అందుకే నిరంతరం వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబానికి పులివెందులలో ఎన్నడూ ఓడిపోయిన చరిత్ర లేదని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు నియంతలా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, అధికారంలోకి వచ్చాక రూ.3.5 లక్షల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులతో రాష్ట్రానికి ఏం చేసిందని అంబటి ప్రశ్నించారు. వైసీపీని తిట్టడం తప్ప వీరికి పాలన చేతకావడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలకు గిట్టుబాటు ధర లేదని... మొక్కజొన్న ధరలపై ప్రశ్నిస్తే గోడౌన్లపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ యుద్ధాల నెపంతో పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూసే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయడం లేదని, చంద్రబాబు, లోకేష్ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు.

## తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూలైన్లు బయటకు ఏకంగా బాట గంగమ్మ ఆలయం వరకు పొడిగించారు. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 24 నుంచి 30 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవులు, వారాంతం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. రద్దీ తీవ్రతకు అనుగుణంగా టీటీడీ అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. టీటీడీ గణాంకాల ప్రకారం, నిన్న మే 23వ తేదీ శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 97,561 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 57,780 మంది యాత్రికులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదే రోజున శ్రీవారి హుండీకి రూ. 3.76 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది.

## జొన్న, మొక్కజొన్న రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన తెలంగాణ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

మొక్కజొన్న కొనుగోలుకు రూ.1,800 కోట్లు, జొన్న కొనుగోలుకు రూ.1,100 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న సేకరించాలని తాము కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని, అందుకే రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ముందుకొచ్చిందని మంత్రి స్పష్టం చేశారు.భారీ దిగుబడుల నేపథ్యంలో రైతులను కాపాడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తుమ్మల పేర్కొన్నారు. మొక్కజొన్న సేకరణకు ఇదివరకే రూ.4,000 కోట్లు విడుదల చేయగా, తాజా కేటాయింపులతో కలిపి ఆ మొత్తం రూ.5,800 కోట్లకు చేరిందన్నారు. జిల్లాల వారీగా ఈ పంటల సేకరణకు తక్షణమే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో పాటు పొద్దుతిరుగుడు రైతులను కూడా ఆదుకుంటామని, 25 శాతానికి మించి ఆ పంటను కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు.

## ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

(మొదటి పేజీ తరువాయి)

గ్రామానికి చెందిన చంబనోళ్ల ముత్యంరెడ్డి (36)తో 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పదేళ్లలోపు కూతురు, కుమారు డు ఉన్నాడు. మృతుడు ముత్యంరెడ్డి నారాయణఖేడ్ పట్టణంలో మోటారు వైండింగ్ మెకానిక్‌గా పనిచేస్తున్నా డు. కల్పన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేసి ఈ మధ్య కాలంలో ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా చేరింది. కాగా ఈ నెల 16వ తేదీ నుంచి ముత్యంరెడ్డి కనిపించకుండా పోయాడు. దీంతో తన భర్త కనిపించడం లేదని కుటుంబీకులతో కలిసి కల్పన నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 18న ఫిర్యాదు చేసింది.పోలీసులు ముత్యంరెడ్డి కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో కేసును సవాల్‌గా తీసుకున్నారు. భార్య కల్పన ఫోన్ కాల్స్‌పై నిఘాపెట్టగా 16న తన ప్రియుడైన మనూరు మండలం ఎల్గోయికి చెందిన గైని పండరి అలియాస్ చింటుతో చాలా సార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా ముత్యంరెడ్డిని హత్యచేసి ఎల్గోయిలోని పండరి చేనులో మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు నేరం అంగీకరించారు. పోలీసులు ఆదివారం గోతిలోంచి మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## సాయి మందిరంలో సామూహిక సహస్ర పారాయణం

**- రాజాపేటలో ఆధ్యాత్మిక శోభ**

**- దేవతామూర్తులకు ప్రత్యేక అర్చనలు.. గోత్రనామార్చనలు**

**- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. జై శ్రీమన్నారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సామూహిక సహస్ర పారాయణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ భక్తులంతా ఒకేచోట చేరి భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణంతో పాటు హనుమాన్ చాలీసా పారాయణాన్ని పఠించారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలోని దేవతామూర్తులకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. పారాయణంలో పాల్గొన్న భక్తుల పేరున ప్రత్యేక గోత్రనామార్చనలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు నంగునూరు జగదాంబ, బిర్రు భాగ్యలక్ష్మి, పెంట రజిత, పుష్పలత, చామకూర అరుణతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## పాతికేళ్ల దోస్తీ.. జ్ఞాపకాల బస్తీ!

**- పాఠశాల గూటిలో 'రజతోత్సవ' సంబరం**

**- రఘునాథపురం ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**- పావు శతాబ్దం తర్వాత ఒకే వేదికపైకి '2000-2001' ఎస్ఎస్సీ బ్యాచ్**

**- గురువులకు ఘన సత్కారం.. విద్యాలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తీర్మానం**




**తొలివెలుగు, రాజాపేట:** కాలచక్రం వేగంగా కదిలి పావు శతాబ్దం గడిచినా, నాడు చదువులమ్మ ఒడిలో చిగురించిన స్నేహబంధం రజతోత్సవ కాంతితో మెరిసింది. రాజాపేట మండలం రఘునాథపురం గ్రామంలోని సంగిశెట్టి నరసయ్య మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2000-2001 విద్యాసంవత్సరం పదో తరగతి (ఎస్ఎస్సీ) బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగింది. సరిగ్గా 25 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం నాటి మిత్రులంతా తాము చదువుకున్న విద్యా నిలయంలోనే మళ్లీ కలుసుకోవడంతో అపూర్వ దృశ్యం ఆవిష్కృతమైంది.కార్యక్రమం ప్రారంభంలో పూర్వ విద్యార్థులంతా కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి, జ్ఞానదాత సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం, నాటి రోజుల్లో తమను క్రమశిక్షణతో తీర్చిదిద్ది, జీవితంలో ఉన్నత స్థానాలకు చేర్చిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి, పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు చాటుకున్నారు. ప్రస్తుతం వివిధ వృత్తులు, వ్యాపారాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాల పురోగతికి, మౌలిక వసతుల కల్పనకు తమ వంతుగా పూర్తి భాగస్వామ్యం అందిస్తామని ఈ సందర్భంగా సామూహికంగా తీర్మానం చేశారు. మిత్రులంతా కలిసి సహపంక్తి భోజనాలు చేసి, బాల్యపు జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆహ్లాదంగా గడిపారు. ఈ రజతోత్సవ వేడుకలో నాటి ఉపాధ్యాయులు, 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వడదెబ్బతో కూలి హఠాన్మరణం

**- కూలి పని నుంచి వస్తూ అకస్మాత్తుగా కుప్పకూలిన వైనం**

**- బొందుగుల గ్రామంలో విషాద ఛాయలు**

**- ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచి పయ్యావుల ఎల్లయ్య విజ్ఞప్తి**



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బొందుగుల గ్రామానికి చెందిన ఓ పేద కూలి వడదెబ్బకు గురై హఠాన్మరణం చెందాడు. గ్రామ సర్పంచి పయ్యావుల ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బొందుగుల గ్రామానికి చెందిన గోపగాని శ్రీధర్ (38) వృత్తిరీత్యా కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఆదివారం రోజువారీ లాగే కూలి పనికి వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఎండ దెబ్బకు అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు కలిసి చికిత్స నిమిత్తం ఆయనను తక్షణమే భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీధర్ మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంపాదిస్తూ కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ పేద కుటుంబం వీధిన పడిందని సర్పంచి ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వంతో స్పందించి ప్రభుత్వం ఆ కుటుంబాన్ని తక్షణమే ఆదుకోవాలని, ఇందుకోసం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవ చూపి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా చూడాలని ఆయన కోరారు.

# ఆర్టీసీ స్థలం.. పెట్రోల్ బంక్‌కు దారాదత్తం..?






**- చౌటుప్పల్ బస్టాండ్ భవిష్యత్తుపై ప్రయాణికుల ఆందోళన**

**- నడిబొడ్డున నిర్మాణ పనులు.. మౌనం వీడని అధికారులు, ప్రజాప్రతినిధులు**

**- ప్రజా రవాణా ఆస్తులను పరిరక్షించాలని స్థానికుల డిమాండ్**

**తొలివెలుగు, చౌటుప్పల్ :** పట్టణ అభివృద్ధికి కీలకమైన ప్రభుత్వ స్థలాలు క్రమంగా వాణిజ్య అవసరాల కోసం వినియోగంలోకి వెళ్లడం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చౌటుప్పల్ పట్టణ నడిబొడ్డున జాతీయ రహదారి-65కు ఆనుకుని ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పెట్రోల్ బంక్ నిర్మాణం చేపట్టడం ప్రస్తుతం స్థానిక ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పరిమిత స్థలంలో అరకొర వసతులతో కార్యకలాపాలు కొనసాగిస్తున్న బస్టాండ్‌కు చెందిన విలువైన భూమిని ఓ చమురు సంస్థకు లీజుకు ఇవ్వడంతో, భవిష్యత్తులో బస్టాండ్ విస్తరణకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుతం ఆర్టీసీకి చెందిన ఈ స్థలంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పట్టణంలో అత్యంత విలువైన, వ్యూహాత్మక ప్రాంతంలో ఉన్న ఈ భూమిని భవిష్యత్తు ప్రజా రవాణా అవసరాల కోసం రిజర్వ్ చేయాల్సి ఉండగా.. కేవలం వాణిజ్య అవసరాలకు, ఆదాయ వనరుగా మార్చుకోవడానికి



కేటాయించడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జనాభా పెరుగుదల, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చౌటుప్పల్‌కు ఆధునిక సదుపాయాలతో కూడిన కొత్త బస్టాండ్ అవసరం ఎంతైనా ఉందని, ఇలాంటి సమయంలో అందుబాటులో ఉన్న ఆర్టీసీ ఖాళీ స్థలాన్ని ఇతర అవసరాలకు మళ్లించడం సరైన నిర్ణయం కాదని ప్రజా సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

**బస్టాండ్ విస్తరణకు గండేనా..?**

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ పట్టణం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక, వ్యాపార కేంద్రంగా మారుతోంది. ఈ మార్గం గుండా ప్రతినిత్యం వేలాది మంది ప్రయాణికులు, వందలాది ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుత అవసరాలకే ఇక్కడి బస్టాండ్ స్థలం సరిపోవడం లేదు. భవిష్యత్తు అవసరాల కోసం ఉన్న కాస్త ఖాళీ స్థలంలో ఇలా పెట్రోల్ బంక్ నిర్మిస్తే, రేపటి రోజున బస్టాండ్ విస్తరణ పూర్తిగా అసాధ్యంగా మారుతుందని, తద్వారా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పవని రవాణా రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**స్పందించని అధికారులు.. మౌనంగా ప్రజాప్రతినిధులు!**

బస్టాండ్ ఆవరణలోనే ఇంత పెద్ద ఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ, దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు కానీ, సంబంధిత శాఖలు కానీ స్పష్టమైన వివరణ ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఈ తీవ్రమైన సమస్యపై ఇప్పటివరకు మౌనం వహించడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చౌటుప్పల్ నియోజకవర్గ ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పే నాయకులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ప్రజా శ్రేణుల డిమాండ్..**

ఆర్టీసీ స్థలం అనేది ప్రజల ఆస్తి అని, లాభాపేక్ష పక్కనబెట్టి భవిష్యత్తు తరాల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దానిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వివాదాస్పద లీజు వ్యవహారంపై స్థానిక భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని వారు కోరుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి బస్టాండ్ స్థలం పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రయాణికులు, ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

చౌటుప్పల్ వంటి వేగంగా విస్తరిస్తున్న పట్టణంలో ప్రజా రవాణా సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలా? లేక ప్రభుత్వ స్థలాలను వాణిజ్య సంస్థలకు కట్టబెట్టాలా? అనే చర్చ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

# ప్రభుత్వ బడి పిల్లలకు 'సుశీలమ్మ ఫౌండేషన్' భారీ నజరానా!

**- రేపు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా నగదు పురస్కారాల పంపిణీ**

**- మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా రూ.32 లక్షలకు పైగా ప్రోత్సాహకాలు**

**- టాప్-3 విద్యార్థులకు రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల బహుమతి**

**- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫౌండేషన్ ప్రతినిధి మౌనిక గౌడ్ పిలుపు**

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించేందుకు ఉద్దేశించిన 'ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ప్రతినిధి పెద్దగోని మౌనిక గౌడ్ కోరారు. మే 26 (మంగళవారం) ఉదయం 8:00 గంటలకు మునుగోడు పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ వినూత్న పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది. ఈ వేడుకకు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు నగదు బహుమతులను అందజేయనున్నారు.

ఈ సందర్భంగా మౌనిక గౌడ్ మాట్లాడుతూ.. 2025-2026 విద్యా సంవత్సరానికి గాను మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 63 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 192 మంది విద్యార్థిని విద్యార్థులను ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఫౌండేషన్ తరఫున మొత్తం రూ. 32,20,000/- నగదు ప్రోత్సాహకాలను విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అందజేస్తున్నామన్నారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ. 25,000, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ. 15,000, తృతీయ స్థానం సాధించిన ప్రతిభావంతులకు రూ. 10,000 చొప్పున నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. ఈ సువర్ణావకాశాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# కళ్లెం బిక్షపతి గౌడ్ మృతికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నివాళి





**- పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే**

**- బిక్షపతి సేవలు వెలకట్టలేనివి: బీర్ల ఐలయ్య**

**- కల్వపల్లి గ్రామంలో విషాద ఛాయలు**

**తొలివెలుగు, రాజాపేట:** మండలం కల్వపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్ద కళ్లెం బిక్షపతి గౌడ్ (65) అనారోగ్యంతో ఆదివారం వేకువజామున కన్నుమూశారు. బిక్షపతి గౌడ్ మృతి వార్త తెలిసిన వెంటనే ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కల్వపల్లి గ్రామానికి చేరుకుని ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు. మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసప్తప్త కుటుంబ సభ్యులను పరామర్శించి తన గాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. కళ్లెం బిక్షపతి గౌడ్ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, గ్రామ ప్రజల సేవా కార్యక్రమాల్లో ఎనలేని కృషి చేశారన్నారు. నిబద్ధత గల నాయకుడిగా పార్టీకి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి, కల్వపల్లి గ్రామానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వపల్లి గ్రామ సర్పంచి ఇంజ లక్ష్మి, రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రంగా నరేష్ గౌడ్, చల్లూరు గ్రామ సర్పంచి భీమగాని రూప బాల నర్సయ్య, ఉప సర్పంచి బొంత సుధాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, రఘునాథపురం మాజీ ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్య గౌడ్, కల్వపల్లి ఉప సర్పంచ్ కళ్లెం పాండుగౌడ్, గుంటి శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## పదహారేళ్ల సుదీర్ఘ ప్రయాణం.. స్నేహబంధాల ఆత్మీయ సమ్మేళనం

- ఘనంగా బేగంపేట జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల కలయిక
- గురువులకు పాదాభివందనం.. ఘన సన్మానం
- చిన్ననాటి జ్ఞాపకాల్లో తేలియాడిన 2009-10 పదో తరగతి బ్యాచ్

**తొలివెలుగు, రాజాపేట:** కాలచక్రం వేగంగా తిరుగుతున్నా, నాటి విద్యా నిలయంలో చిగురించిన స్నేహబంధం మాత్రం చెక్కుచెదరలేదని బేగంపేట పాఠశాల పాత మిత్రులు నిరూపించారు. రాజాపేట మండలం బేగంపేట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2009-2010 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానికంగా అత్యంత వైభవంగా జరిగింది. ఒకటి కాదూ రెండు కాదూ.. ఏకంగా 16 సుదీర్ఘ సంవత్సరాల తర్వాత నాటి సహచరులంతా ఒకే వేదికపైకి రావడంతో ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది. పాఠశాల రోజులు మళ్లీ ప్రతి ఒక్కరి కళ్లముందు కదలాడాయి.
"స్నేహితుడిగా జీవించు - స్నేహితుడని గర్వించు" అనే అద్భుత నినాదంతో నిర్వహించిన ఈ గెట్ టుగెదర్ వేడుకలో మిత్రులంతా ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన నాటి గురువులను విద్యార్థులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం సమాజంలో వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో స్థిరపడినప్పటికీ.. ఈ సమ్మేళనంలో మాత్రం హోదాలన్నీ పక్కన పెట్టేశారు. చిన్ననాటి అల్లరి పనులు, తరగతి గది జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఎంతో ఆనందంగా గడిపారు. ఈ స్నేహం జీవితాంతం ఇలాగే కొనసాగాలని మిత్రులందరూ ఒకరికొకరు హత్తుకుని ప్రతినబూనారు. కార్యక్రమంలో పాఠశాల నాటి ఉపాధ్యాయులు, 2009-10 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.
ఆయిల్ ఫామ్ తోటలకు కరెంటు కష్టాలు

## సమస్యల సాధన వరకు పోరుబాటే..

- 7వ రోజుకు చేరిన వీవోఏల నిరసన దీక్షలు
- డిమాండ్ల సాధనకు వెనక్కి తగ్గేది లేదన్న జేఏసీ జిల్లా అధ్యక్షురాలు మోలుగురి శిరీష
- ఆత్మకూరు (ఎం)లో కొనసాగుతున్న ఆందోళన




**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** గ్రామ సంఘాలకు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వీవోఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వీవోఏ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు మోలుగురి శిరీష డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట వీవోఏలు చేపట్టిన సమ్మె దీక్షలు ఆదివారం నాటికి 7వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. నిరుపేద మహిళల అభ్యున్నతికి దశాబ్దాలుగా కృషి చేస్తున్న వీవోఏల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని, పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
**ప్రధాన డిమాండ్లు ఇవే..**
వీవోఏలకు నెలకు రూ. 20 వేల కనీస వేతనం చెల్లించాలి.
విధి నిర్వహణలో ఉన్న అందరికీ ప్రమాద బీమా (ఇన్సూరెన్స్) సౌకర్యం కల్పించాలి. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి. అర్హత కలిగిన ప్రతి వీవోఏకు సీసీ (కమ్యూనిటీ కోఆర్డినేటర్)గా పదోన్నతి కల్పించాలి. వివాదాస్పదంగా ఉన్న 58 జీవోను వెంటనే సవరించి తమకు న్యాయం చేయాలి.ప్రభుత్వం దిగివచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళనలు కొనసాగుతాయని నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ దీక్షా శిబిరంలో వీవోఏ జేఏసీ నాయకులు మేడి రామ్ లక్ష్మణ్, వేముల నర్సింహ్మా, గొర్రెంకల నిర్మల, సుదగాని సూరమంభ, పోలేపాక భాగ్యమ్మ, కే. శ్రీనివాస్, పి. సునీత, తుమ్మల సరిత, యాస మహేశ్వరి, ప్రమీల, శ్యామల, లావణ్య, బూడిద సుచరిత, ఎం. జయమ్మ, మౌనిక, ఉపేంద్ర, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## కాల్వపల్లి గ్రామ కొనుగోలు కేంద్రం సమీపంలో భారీ అగ్నిప్రమాదం

**తొలివెలుగు,ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం సింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని కాల్వపల్లి గ్రామం ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. మంటలు అదుపులోకి రాకపోవడంతో గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను ఆర్పడంతో వరి ధాన్యానికీ ఎలాంటి హాని జరగలేదు. ఈ అగ్ని ప్రమాదం కరెంటు తీగలు గాలికి ఒకదానికొకటి అల్లుకుని మిరుగులు నేలపై చిల్లడంతో గాలికి చిన్న చిన్నగా మంటలు చెలరేగి ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు వచ్చాయి.



# నెలాఖరు నాటికి ధాన్యం సేకరణ పూర్తి చేయాలి






- ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రుల ఆదేశం
- రాష్ట్రంలో ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు పూర్తి
- తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై కఠిన చర్యలు
- నేటి నుంచి 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ

**తొలివెలుగు, హైదరాబాద్/ యాదాద్రిభువనగిరి :** యాసంగి వరి ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ఈ నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా కొనుగోళ్లను పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. యాసంగి-2026 సీజన్‌కు గాను రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, వేసవి తీవ్రత, హమాలీల కొరత వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గడిచిన మూడు సీజన్ల నుండి దేశంలోనే ప్రభుత్వ పరంగా రైతుల నుండి అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రభాగాన నిలిచిందని గుర్తు చేశారు. ఇందుకోసం రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతుల ఖాతాల్లో రూ. 45 వేల కోట్లకు పైగా నిధులు జమ చేశామని వివరించారు. అకాల వర్షాల ముప్పు ఉన్నందున సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు పంపుతామని రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో తాలు, తరుగు పేరిట రైతులను నష్టపరిచే మిల్లర్లు, ట్రేడర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**వరి కొయ్యలు కాల్చవద్దు: మంత్రి తుమ్మల**
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పంట కోతల అనంతరం రైతులు వరి కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణం, భూసారం దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై గ్రామగ్రామాన రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు.

**మహిళా సంక్షేమ వారోత్సవాలు**
అనంతరం మంత్రి సీతక్క, సీఎస్ రామకృష్ణారావు, పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, ఉన్నతాధికారులు చిత్రారామచంద్రన్, దివ్య దేవరాజన్‌లు మే 25 (సోమవారం) నుండి ప్రారంభం కానున్న 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను కోరారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వెంకారెడ్డి, సివిల్ సప్లై అధికారి రోజా రాణి, మేనేజర్ హరికృష్ణ, వ్యవసాయ అధికారి రమణారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలింగ్ ముగిసినా.. తీరని కార్యదర్శుల కొరత

- రాజాపేట మండలంలో మళ్లీ 'ఇన్‌ఛార్జ్'ల పాలనేనా?
- బదిలీల్లోనూ భర్తీ కాని 5 పంచాయతీల పోస్టులు
- మిగిలిన చోట్ల పాతవారే సేవలు.. కొత్త సర్పంచుల్లో నిరాశ

**తొలివెలుగు, రాజాపేట:** జిల్లాలోనే మారుమూల ప్రాంతమైన రాజాపేట మండలంలో పంచాయతీ కార్యదర్శుల ఖాళీల సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సిలింగ్‌లో సైతం రాజాపేట మండలానికి పూర్తిస్థాయిలో కార్యదర్శులు దక్కలేదు. మండలంలో మొత్తం 23 గ్రామ పంచాయతీలు ఉండగా.. కౌన్సిలింగ్ అనంతరం కేవలం 7 గ్రామాలకు మాత్రమే కొత్తగా కార్యదర్శులు బదిలీపై వచ్చారు. మరో 11 గ్రామాల్లో ఎప్పటి నుంచో పనిచేస్తున్న పాత కార్యదర్శులే యథావిధిగా కొనసాగుతున్నారు. అయితే, మిగిలిన 5 కీలక గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల పోస్టులు ఖాళీగానే ఉండిపోవడంతో మళ్లీ అదనపు బాధ్యతల (ఇన్‌ఛార్జ్) తిప్పలు తప్పేలా లేవు.

**బదిలీల లెక్కలిలా..**
కౌన్సిలింగ్ నిబంధనల ప్రకారం పారుపల్లి గ్రామానికి స్వర్ణ, పాముకుంటకు మమత, కల్వపల్లికి భాను, లక్ష్మక్కపల్లికి జ్యోతి, రాజాపేటకు ఆర్ఎం. రెడ్డి, పుట్టగూడెంకు పవన్, రఘునాథపురం గ్రామానికి సాగర్ బదిలీపై వచ్చారు. వీరిలో రఘునాథపురం వచ్చిన సాగర్ మినహా మిగిలిన 6 గురు ఇదివరకే రాజాపేట మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తూ.. తాజా బదిలీల్లో మండలంలోని ఇతర గ్రామాలను ఎంచుకోవడం గమనార్హం. కాగా నమిల (జమీల్), బసంతాపురం (వెంకట్), రేణిగుంట (వెంకటేష్ నాయక్), బేగంపేట్ (దేవమని), నర్సాపురం (లక్ష్మణ్), సోమారం (మౌనిక), దూది వెంకటాపురం (గాంధీ), మొల్లగూడెం (చక్రి)లు బదిలీల్లో పాల్గొనకుండా పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. కుర్రారంలో తుర్కపల్లి నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన పవన్, చల్లూరులో ఆలేరు నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన మహేష్‌లు యథావిధిగా విధుల్లో ఉన్నారు.

**5 గ్రామాల్లో ఖాళీలు.. సర్పంచుల ఆందోళన**
ఈ బదిలీల హడావుడి ముగిసినా.. మండలంలోని సింగారం, కొత్తజాల, జాల, బూరుగుపల్లి, కొండ్రెడ్డి చెరువు గ్రామ పంచాయతీలకు మాత్రం కార్యదర్శులు ఎవరూ రాకపోవడంతో ఆ పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి. గతంలో 6 గ్రామాలకు కార్యదర్శులు లేకపోవడంతో మిగిలిన వారే ఇన్‌ఛార్జ్‌లుగా అదనపు బాధ్యతలు మోశారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం కానుంది. తమ గ్రామాలకు పూర్తిస్థాయి కార్యదర్శులు వస్తారని ఆశపడ్డ కొత్త సర్పంచులు ఈ ఫలితంతో భంగపడ్డారు. మరోవైపు, సొంత నిధులు వెచ్చించి చేసిన పనులకు సంబంధించిన బకాయిలు ఇంకా రాకపోవడంతో కార్యదర్శులు భయాందోళన చెందుతూ రాజాపేట మండలానికి రావడానికి వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది.

# పదిహేనేళ్ల స్నేహం.. ఆత్మీయ సమ్మేళనం




- అక్షరాల గూటిలో.. ఆత్మీయ కలయిక..
- ముత్తిరెడ్డిగూడెం మానస విద్యా మందిర్ పూర్వ విద్యార్థుల కలయిక
- గురువులకు సత్కారం.. దివంగత మిత్రులకు అశ్రునివాళి
- చిన్ననాటి జ్ఞాపకాల్లో తేలియాడిన '2010-11' పదో తరగతి బ్యాచ్

**తొలివెలుగు, చౌటుప్పల్/మోటకొండూరు:**
కాలం మారింది.. వయసు పెరిగింది.. బాధ్యతలు తోడయ్యాయి.. కానీ, వారి 'స్నేహం' మాత్రం పదిహేనేళ్ల క్రితం నాటి పాఠశాల గూటిలోనే ఆగిపోయింది. మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామ పరిధిలోని మానస విద్యా మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 2010-11 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానికంగా అత్యంత కోలాహలంగా, భావోద్వేగాల మధ్య జరిగింది. ఒకటి కాదూ రెండు కాదూ.. ఏకంగా 15 సుదీర్ఘ సంవత్సరాల తర్వాత నాటి సహచరులంతా ఒకే వేదికపైకి రావడంతో పాఠశాల రోజులు మళ్లీ కళ్లముందు కదలాడాయి.
కార్యక్రమం ప్రారంభానికి ముందు.. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన తమ బ్యాచ్ మిత్రులు కంది శశిధర్ రెడ్డి, రావుల నాగరాజుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మిత్రుల అకాల మృతిని తలచుకుని సహచరులు కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం నాటి గురువులతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం సమాజంలో వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో స్థిరపడినప్పటికీ.. ఈ సమ్మేళనంలో మాత్రం హోదాలన్నీ పక్కన పెట్టేశారు. 'ఏరా.. ఒరేయ్' అనే చిన్ననాటి పిలుపులతో మళ్లీ బాల్యంలోకి వెళ్లిపోయారు. తరగతి గది అల్లరులు, బెంచ్ వెనుక దాక్కుని తిన్న లంచ్ బాక్సుల ముచ్చట్లను గుర్తుచేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరిస్తూ, ఈ స్నేహబంధం నిరంతరం కొనసాగాలని ప్రతినబూనారు. ఈ సమ్మేళనంలో బీఎంఆర్ఎస్ అధినేత బొప్పిడి మల్లారెడ్డి, కరస్పాండెంట్ రాఘవేందర్ రెడ్డి, ఎండీ మధార్, వెంకటేశం, సంతోష్, ఆనంద్, లత, నిర్మలతో పాటు పూర్వ విద్యార్థులు రమేష్ రెడ్డి, లింగస్వామి, నాగరాజు, సతీష్, ఫయాజ్, సాయి, భగవాన్ రెడ్డి, నవీన్, పవన్, మధు, శశి, శ్రీకాంత్, కల్యాణి, శ్రీలత, సోని, అఖిల, సౌజన్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..


# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి





- రామన్నపేట మండలంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకస్మిక తనిఖీ
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశం
- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**తొలివెలుగు, రామన్నపేట:** ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. ఆదివారం రామన్నపేట మండల పరిధిలోని వెల్లంకి, సిరిపురం, దుబ్బాక, మునిపంపుల, ఎన్నారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలతో పాటు రామన్నపేట పట్టణ కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ధాన్యం నిల్వలు, తేమ శాతం రికార్డులను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన తాగునీరు, నీడ, గన్నీ బ్యాగులు తదితర అన్ని కనీస వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. వర్ష సూచనలు ఉన్నందున సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు పక్షపాతిగా ఉంటుందని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని భరోసా ఇచ్చారు. కొనుగోళ్లలో జాప్యం చేసినా, తాలు, తరుగు పేరిట ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని అధికారులను, మిల్లర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ తోటలకు కరెంటు కష్టాలు

- మూడు రోజులుగా 'త్రీఫేస్' బంద్.. ఎండిపోతున్న ఆయిల్ ఫామ్ తోటలు
- అడ్డగూడూరు మండలం ధర్మారం ఫీడర్ పరిధిలో విద్యుత్ సమస్య
- అధికారులకు ఫోన్ చేసినా స్పందన కరువని రైతుల ఆవేదన
- తక్షణమే స్పందించి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్



**తొలివెలుగు, అడ్డగూడూరు:** మండల పరిధిలోని ధర్మారం విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫీడర్) పరిధిలో సాంకేతిక లోపాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా త్రీఫేస్ (వ్యవసాయ) విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆయిల్ ఫామ్ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన పలువురు ఆయిల్ ఫామ్ రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గత మూడు రోజులుగా గ్రామానికి సాగునీటి (నీళ్ల) కరెంటు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రస్తుత తరుణంలో తోటలకు నిరంతరం నీరు అందించాల్సి ఉండగా, కరెంటు లేకపోవడంతో ఆయిల్ ఫామ్ చెట్లు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యుత్ సరఫరా సమస్యపై క్షేత్రస్థాయిలో వివరణ కోరేందుకు మండల విద్యుత్ శాఖ అధికారికి (ఏఈ) బాధితులు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న తోటలు నీరు లేక దెబ్బతింటుంటే అధికారులు కనీసం ఫోన్ ఎత్తకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ విషయమై తక్షణమే జోక్యం చేసుకోవాలని, ధర్మారం ఫీడర్ పరిధిలో త్రీఫేస్ విద్యుత్ సమస్యను పరిష్కరించి తోటలను కాపాడాలని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన రైతులు పొన్నాల వెంకటేశ్వర్లు, నక్క అబ్బయ్య, నక్క వీరయ్య తదితరులు డిమాండ్ చేశారు.

# రైతు పండించిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలి

**రైతుల నుండి హమాలీల పేరుతో సుతిలి పేరుతో వసూలు చేస్తున్న.. అక్రమ వసూళ్లను అరికట్టాలి**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి**



**తొలివెలుగు,సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రైతు బాంధవుడు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంటే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ధాన్యం సేకరణలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సుతిలి,గోనె బస్తాలు మరియు హమాలి కూలీల డబ్బులను రైతులకు ఉచితంగా అందిస్తుంటే పట్టి డబ్బులను తెలంగాణ రైతాంగానికి అందించకుండా, తిరిగి రైతుల దగ్గర నుంచే క్వింటాలుకు ?40 చొప్పున హమాలి డబ్బులు వసూలు చేస్తూ,సుతిలి కూడా మీరే తెచ్చుకోవాలని రైతులకు చెప్పడం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని దగా చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు మంచినీరు టెంట్ లాంటి కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయకుండా రైతుల దగ్గర నుండి డబ్బులు వసూలు చేసుకుంటూ నిలువు దోపిడీకి పాల్పడుతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు అధికారుల తీరు వెంటనే మార్చుకోకపోతే రైతులతో కలిసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్,ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు వెంకటాచారి,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర నరసింహ గౌడ్,చిమిర్యాల సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్, ఉపసర్పంచులు బండమీది కిరణ్,ఎలిజాల శీను,మెరుగు సైదులు మండల ఉపాధ్యక్షులు కట్కూరి లక్ష్మీ వెంకటేష్ గౌడ్, సుర్వి వెంకటేష్ గౌడ్, కార్యదర్శిలు కోడూరు బీరప్ప, నర్రి లక్ష్మీనరసింహ, పార్టీ సీనియర్ నాయకులు భూసా శీను,అంతటి సురేష్ గౌడ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి కాట్కూరి శ్రీకాంత్ గౌడ్,మొగుదాల సురేష్ గౌడ్ మొగుదాల శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అనేది బోగస్ ఓటర్ల ఏరివేతకే





- మాజీ మంత్రి, ఎస్ఐఆర్ జోనల్ ఇంచార్జీ మర్రి శశిధర్‌రెడ్డి

**రాజేంద్రనగర్ అసెంబ్లీలో ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు**

**తొలివెలుగు,గండిపేట:** ఎస్ఐఆర్ అనేది బోగస్ ఓటర్ల ఏరివేతకే అని మాజీ మంత్రి, ఎస్ఐఆర్ జోనల్ ఇంచార్జీ మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ ఎస్ఐఆర్ కన్వీనర్ మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ అసెంబ్లీ సమావేశాన్ని పిఆర్ ప్యాలెస్‌లో ఆదివారం ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ అంటే దొంగ ఓట్లు ఉన్న వారు భయబ్రాంతులకు గురవుతున్నారని అసలు ఓటు హక్కు ఉన్న వారు ఎస్ఐఆర్ అంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఓటరు లిస్టులో ఉన్న పేరు మ్యాపింగ్ ద్వారా నిర్ధారణ చేసుకోవడమే ఎస్ఐఆర్ యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. అకారణంగా ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఎస్ఐఆర్ వల్ల తొలగించబడదని ఆయన అన్నారు. ఒక ఓటరు ఇతర జిల్లా నుంచి నగరానికి వచ్చి ఉంటే అటువంటి వారికి బీజేపీ ఎస్ఐఆర్ సలహా కేంద్రాలు సరైన అవగాహన కల్పించి వారి పేర్లను ఓటరు జాబితాలో వారు ప్రస్తుతం ఉన్న నియోజకవర్గం, డివిజన్, బూత్‌లలో చేర్చడం జరుగుతుంద˘న్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లి ప్రతి ఓటరు వివరాలను వ్యక్తిగతంగా ధృవీకరిస్తారన్నారు. ఇప్పటికే ఓటరుగా ఉన్న వారు తమ వివరాలను ధృవీకరించుకోవడానికి కొత్త ఓటర్లు నమోదు కోసం ఫామ్--6 నింపాలన్నారు. లేదంటే తొలగించడానికి, మార్పులు చేర్పుల కోసం ప్రత్యేక ఫారాలను నింపాలన్నారు. ఈసీ చివరిగా 2002--2004 మధ్య చాలా రాష్ట్రాల్లో ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించిందన్నారు. ఆ రివిజన్‌ను కూడా ఇప్పుడు పరిగణనలోకి తీసుకోని పోల్చి చూస్తారన్నారు. చివరి ఇంటెన్సివ్ రివిజన్ జాబితాలో తమ పేర్లు లేనివారు లేదా వారి తల్లిదండ్రుల పేర్లు లేనివారు తమభారత పౌరసత్వం, వయస్సును రుజువు చేసే పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించిన తర్వాత అభ్యంత రాలు, ఫిర్యాదులను స్వీకరించి విచారించి పరిష్కరిస్తారన్నారు. అన్ని అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ నారాగూడెం మల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేంద్రనగర్ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, గోల్కొండ ఇంచార్జ్ వై.శ్రీధర్, కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, వనితరెడ్డి, సదానంద్, కాడెం సుధాకర్, జయనంద్‌రెడ్డి, బాబురావు, నిఖిల్, విక్రమ్‌చారి, రవి, వెంకటేష్, సందీప్ ముదిరాజ్, ఆనంద్, వెంకట్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, పద్మావతి, సరితరెడ్డి, అనురాధ, కవిత, స్వప్నారెడ్డి, అమర్, శ్రీనివాస్, విజయ్, శివ, షేక్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

- వలిగొండ మండల రెడ్డి సంఘం సమావేశంలో తీర్మానం
- గ్రామాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి
- సంఘం మండల అధ్యక్షుడు గూడూరు జంగారెడ్డి




**తొలివెలుగు, చౌటుప్పల్/వలిగొండ:** తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన రెడ్డి సామాజిక వర్గ ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణమే రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం వలిగొండ మండల అధ్యక్షుడు గూడూరు జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్క సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో రెడ్డి సంఘం మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు అన్ని సామాజిక వర్గాల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్లు ఉన్నాయని, అదే తరహాలో రెడ్డి కులస్తుల కోసం కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో కూడా ఎంతోమంది ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారిని ఆదుకోవడానికి ఈ కార్పొరేషన్ దోహదపడుతుందని పేర్కొన్నారు.

మండలంలోని రెడ్డి సంఘం సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి, తమ తమ గ్రామాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా కోరారు. సంఘాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం ద్వారానే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘం నాయకులు పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, పనుమటి మమత, పాశం సత్తిరెడ్డి, జక్క జంగారెడ్డి, సోలిపురం సాగర్ రెడ్డి, మెట్టు కొండల్ రెడ్డి, ఫైళ్ళ మల్లారెడ్డి, మన్నెం వెంకట్ రెడ్డి, భీమిడి వెంకటరెడ్డి, అనంతరెడ్డి, వాకిటి సంజీవరెడ్డి, కళ్లెం జంగారెడ్డిలతో పాటు వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తగూడెం చౌరస్తా వద్ద అండర్ పాస్ నిర్మించాలి

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేత
- రహదారి దాటాలంటే పాదాచారుల విలవిల
- సానుకూలంగా స్పందించిన పార్లమెంటు సభ్యుడు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** జాతీయ రహదారి-65 పై గల పోచంపల్లి కొత్తగూడెం ఎక్స్ రోడ్డు వద్ద ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుత్తి బాల శంకర్ కోరారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డిని కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బాల శంకర్ జంక్షన్ వద్ద నిత్యం ఎదురవుతున్న ప్రమాదకర పరిస్థితులను ఎంపీకి వివరించారు. పోచంపల్లి పరిసర ప్రాంతాల్లోని సుమారు 30 గ్రామాలకు ఈ చౌరస్తా ప్రధాన కూడలిగా ఉందని పేర్కొన్నారు. ప్రతినిత్యం వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, పర్యాటకులు, స్థానిక ప్రజలు హైదరాబాద్ వెళ్లాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ఈ హైవే దాటాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు జంక్షన్‌ను ఎక్స్‌ప్రెస్ హైవేగా అభివృద్ధి చేసిన నేపథ్యంలో వాహనాల వేగం విపరీతంగా పెరిగిందని, దీనివల్ల పాదాచారులు రోడ్డు దాటడం సాహసంతో కూడుకున్న పనిగా మారిందన్నారు. ఇప్పటికే ఇక్కడ అనేకమంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోగా, ఎంతోమంది తీవ్ర గాయాలపాలై వికలాంగులుగా మారారని గుర్తుచేశారు. ఇక్కడ అండర్ పాస్ నిర్మిస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ.. క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులు నిజమేనని, జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఉన్నతాధికారులతో మాట్లాడి ఇక్కడ అండర్ పాస్ మంజూరయ్యేలా ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఆశ్రమాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- సాధన, శాంతి నిలయం కేంద్రాలను సందర్శించిన సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత
- నిర్వహణ రిజిస్టర్ల పరిశీలన.. నిర్వాహకులకు పలు సూచనలు



**తొలివెలుగు, వలిగొండ:** ఆశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగులకు నాణ్యమైన సేవలు, మెరుగైన వసతులు కల్పించాలని రామన్నపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.సబిత పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ (రామన్నపేట) ఆధ్వర్యంలో ఆదివారం వలిగొండ మండల పరిధిలోని టేకుల సోమారం గ్రామంలో ఉన్న 'సాధన' మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో అంతర్గతంగా కల్పిస్తున్న వసతులు, పారిశుధ్య పరిస్థితులు, అంతేవాసుల సంరక్షణ విధానాలను ఆమె స్వయంగా పరిశీలించారు.

అనంతరం జడ్జి మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన, మానసిక వికలాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారికి అందించే భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిరంతరం పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వారికి అవసరమైన వైద్య సేవలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఆశ్రమానికి సంబంధించిన అడ్మిషన్ రిజిస్టర్లు, ఇతర అధికారిక పత్రాలను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. అనంతరం వలిగొండ కేంద్రంలోని 'శాంతి నిలయం' ఆశ్రమాన్ని కూడా సందర్శించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో ఆశ్రమ ఇన్‌ఛార్జ్‌లు మీనాక్షి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.